నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
08.
nipuna
Every Wednesday Free Supplement
6 మార్చి 2024
పేజీలు 8

**సబలెంక**

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను అరియానా సబలెంక (బెలారస్) గెలుచుకుంది. జనవరి 28న మెల్‌బోర్న్‌లో జరిగిన ఫైనల్లో సబలెంక చైనా క్రీడాకారిణి జెంగ్‌పై గెలిచింది. అదే విధంగా పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఇటలీకి చెందిన 22 ఏండ్ల జానిక్ సిన్నెర్ గెలుచుకున్నాడు. జనవరి 28న జరిగిన ఫైనల్లో సిన్నెర్ మెద్వెదెవ్ (రష్యా)పై విజయం సాధించాడు. దీంతో ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ గెలిచిన తొలి ఇటలీ ప్లేయర్‌గా రికార్డు సాధించాడు.

## అంతర్జాతీయం

**ప్రపంచ వాణిజ్య సంస్థ**




- 'పెట్టుబడుల సౌకర్యాభివృద్ధి ఒప్పందాన్ని (ఐఎఫ్‌డీ)' భారత్, దక్షిణాఫ్రికా అడ్డుకున్నాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ సదస్సు జెనీవాలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌డీకి సంబంధించిన చర్చలు జరిగాయి. సరిహద్దు దాటి చేసే పెట్టుబడులను క్రమబద్ధం చేసే ఉద్దేశానికి సంబంధించిందే ఈ ఒప్పందం. భారత్ చెప్పిన అభ్యంతరాలు..
- ఐఎఫ్‌డీ అనేది ప్రపంచ వాణిజ్య సంస్థ పరిధికి సంబంధించింది కాదు
- ఐఎఫ్‌డీకి సభ్య దేశాల నుంచి రావాల్సిన మద్దతు దక్కలేదు

**ఎఫ్ఏటీఎఫ్**

- పారిస్ కేంద్రంగా పనిచేసే ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ సంస్థ తన గ్రే లిస్ట్ నుంచి యూఏఈ దేశాన్ని తొలగించింది. అక్రమ ఆర్థిక లావాదేవీలు నిరోధించడంలో యూఏఈ తీసుకున్న చర్యలకు ఎఫ్ఏటీఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది.

**ఆఫ్రికన్ యూనియన్**

- గాడిద చర్మ వాణిజ్యాన్ని పూర్తిగా నిషేధించాలని ఆఫ్రికన్ యూనియన్ తన 37వ సమావేశంలో నిర్ణయించింది. అలాగే ఒక బహుళ ఆర్థిక వ్యవస్థను ఈ సమావేశంలో ఏర్పాటు చేశారు. దానికి ఆఫ్రికన్ క్లబ్ అని పేరు పెట్టారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకు ఆర్థిక సాయం దీని ద్వారా సాధ్యం అవుతుందని భావిస్తుంది. అలాగే 2063 నాటికి ఆఫ్రికన్ యూనియన్ పలు పర్యావరణ, ఆర్థిక లక్ష్యాలను ఎంచుకుంది. అవి సాధించేందుకు కూడా ఈ కొత్త వ్యవస్థను వినియోగించనుంది.



**అర్మేనియా**

- తమ దేశానికి సాయం చేయడంలో వైఫల్యం చెందడం వల్ల ఉమ్మడి భద్రత ఒప్పంద సంస్థ (కలెక్టివ్ సెక్యూరిటీ ట్రీటీ ఆర్గనైజేషన్) నుంచి నిష్క్రమిస్తున్నట్లు అర్మేనియా ప్రకటించింది. రష్యా నేతృత్వంలో ఈ సంస్థ 2002లో ఏర్పాటయ్యింది. యురేషియా ప్రాంతంలో ఇది ఒక ప్రభుత్వాల సైనిక కూటమిగా చెప్పుకోవచ్చు. ప్రస్తుతం ఇందులో రష్యా, అర్మేనియా, బెలారస్, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్ ఉన్నాయి.

**పెరూ**

- డెంగీ వైరస్ తీవ్ర స్థాయిలో విస్తరిస్తున్న నేపథ్యంలో అత్యవసర పరిస్థితిని పెరూ దేశంలో ప్రకటించారు. 2024లో తొలి ఎనిమిది వారాల్లో దాదాపు 31,000 కేసులు నమోదయ్యాయి. ఆ దేశంలో ఉన్న మొత్తం 25 విభాగాలకు 20 విభాగాల్లో అత్యవసర పరిస్థితి అమల్లో ఉంటుంది.

**ఫిలిప్పీన్స్**

- అంతర్జాతీయ కార్మిక సంస్థ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న హింస వేధింపుల ఒప్పందం-2019 పై ఫిలిప్పీన్స్ సంతకం చేసింది. ఈ ఘనతను సాధించిన ఆసియా ఖండపు తొలి దేశం ఇదే. ఇప్పటికే దీనిపై 37 దేశాలు సంతకం చేశాయి.



**దోస్తీ-16**

- భారత్, మాల్దీవులు, శ్రీలంక నావికాదళాలు సంయుక్తంగా 16వ దోస్తీ విన్యాసాలను నిర్వహించాయి. ఫిబ్రవరి 22 నుంచి 25 వరకు ఇవి మాల్దీవుల్లో జరిగాయి. 1991 నుంచి రెండు సంవత్సరాలకు ఒకసారి మూడు దేశాలు ఈ విన్యాసాలను నిర్వహిస్తున్నాయి.

**ప్రపంచ మేధో సంపత్తి సూచీ**

- అమెరికాకు చెందిన చాంబర్ ఆఫ్ కామర్స్ సంస్థ ప్రపంచ మేధో సంపత్తి సూచీ 2024ను విడుదల చేసింది. ప్రపంచ వ్యాప్తంగా 55 దేశాల ఆర్థిక వ్యవస్థలను పరిశీలించింది. ఇందులో భారత్ 42వ స్థానంలో ఉంది. 38.64 మార్కులను భారత్ పొందింది. అమెరికా అగ్రస్థానంలో ఉంది. ఆ తర్వాత యూకే నిలిచింది.

## దినోత్సవాలు

**అరుదైన వ్యాధుల రోజు**

- ఫిబ్రవరి చివరి రోజున అరుదైన వ్యాధుల రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఈ రోజుకు సంబంధించిన ఇతివృత్తం 'మీ కలలను పంచుకోండి'. సాధారణంగా 1000 మందిలో ఒకరికి మాత్రమే సంభవించే వాటిని అరుదైన వ్యాధులుగా పరిగణిస్తారు.

**సెంట్రల్ ఎక్సైజ్ డే**




- ఏటా ఫిబ్రవరి 24న సెంట్రల్ ఎక్సైజ్ డే నిర్వహిస్తారు. 1944లో సెంట్రల్ ఎక్సైజ్ అండ్ సాల్ట్ యాక్ట్ ఇదే రోజున విడుదలయ్యింది. ఈ నేపథ్యంలో ఈ రోజును నిర్వహిస్తారు.

**ప్రపంచ స్వచ్ఛంద సంస్థల రోజు**

- ఏటా ఫిబ్రవరి 27న ప్రపంచ ఎన్‌జీవో రోజుగా నిర్వహిస్తారు. ప్రపంచ పురోగతికి ఆ సంస్థలు చేస్తున్న కృషికి ఈ రోజు కేటాయించారు. ఈ ఏడాది ఈ రోజు ఇతివృత్తం 'సుస్థిర భవిష్యత్తు నిర్మాణం: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో స్వచ్ఛంద సంస్థల పాత్ర'.

## జాతీయం

**ధర్మగార్డియన్**



- భారత్, జపాన్ మధ్య ఐదో ధర్మ గార్డియన్ విన్యాసాలు రాజస్థాన్‌లోని మహాజన్ క్షేత్రంలో నిర్వహించారు. ఫిబ్రవరి 25న ఇవి ప్రారంభమయ్యాయి. మార్చి 9 వరకు కొనసాగుతాయి.

**ఒకే దేశం ఒకే ఎన్నికలు**

- ప్రధానంగా మూడు సవరణలతో 2029లో 'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానాన్ని అమలు చేయవచ్చని 22వ న్యాయ కమిషన్ సూచించింది. ప్రస్తుత రాజ్యాంగంలో పదిహేనో భాగం ఎన్నికలకు సంబంధించింది. రాజ్యాంగ సవరణ ద్వారా XVA (15ఏ)ను చేర్చాలని సూచించింది. లోక్‌సభ, శాసనసభ, స్థానిక సంస్థలకు కూడా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు ఉద్దేశించిన సవరణతో పాటు ఏక కాల ఎన్నికల సుస్థిరత గురించి కూడా న్యాయ కమిషన్ ప్రస్తావించింది. అధికారంలోని ప్రభుత్వం పడిపోతే 'ఒక ఉమ్మడి కేంద్ర' ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం లేదా మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు నిర్వహించడం వంటివి పరిశీలించాలని సూచించింది.

**మహిళలకు శాశ్వత కమిషన్**

- తీర రక్షక దళంలో మహిళలకు శాశ్వత కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. నిజానికి శాశ్వత కమిషన్‌లో చేరాలనే మహిళల పట్ల వివక్ష ఉందని 2021లో 'లెఫ్టినెంట్ కల్నల్ నితీషా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అలాగే 2020లో బబిత పునియా కేసులో కూడా మహిళలకు శాశ్వత కమిషన్ ఏర్పాటును సర్వోన్నత న్యాయ స్థానం ప్రస్తావించింది.

**సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్**

- హోమోసెప్ అటమ్ అనే పేరుతో దేశంలో తొలి సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసే రోబోను ప్రవేశపెట్టారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఇది భాగం. మానవులే పారిశుద్ధ్య పనులను చేతితో చేయకుండా ఉండేందుకు సంబంధించింది. ఈ రోబోను సొలినాస్ అనే సంస్థ రూపొందించింది. కృత్రిమ మేధతో దీన్ని అనుసంధానం చేసింది. 16 నగరాల్లో మొదట ప్రవేశపెట్టారు. సొలినాస్ అనేది ఐఐటీ మద్రాస్‌కు చెందిన ఒక అంకుర సంస్థ.

**అతిపెద్ద ధాన్యాగారం**

- సహకార రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యాగారాన్ని దేశంలో ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి నిర్మాణ కార్యక్రమాలను ప్రధాని ప్రారంభించారు. 700 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నిల్వ చేసేలా రూ.1.25 లక్షల కోట్లతో దీన్ని రానున్న ఐదేళ్లలో పూర్తి చేస్తారు.




**రైసీనా డైలాగ్**

- తొమ్మిదో రైసీనా డైలాగ్‌ను న్యూఢిల్లీలో నిర్వహించారు. ఫిబ్రవరి 21 నుంచి 23 వరకు కొనసాగిన ఈ సమావేశాలకు గ్రీకు ప్రధాని కిరియోకోస్ మిట్సోటకిస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశ ఇతివృత్తం 'చతురంగ: సంఘర్షణ, పోటీ, సహకారం, సృజన'. నార్డిక్-బాల్టిక్ దేశాలు కూడా ఇందులో పాల్గొన్నాయి.

**పులుల సంరక్షణ**

- పులుల సంరక్షణకు అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రం, జాతీయ పులుల ప్రాధికార సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది.

**ఆయుధాలు, క్షిపణులు**

- ఆయుధాలు, క్షిపణులను తయారు చేసే వ్యవస్థను ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో అదానీ సంస్థ ప్రారంభించింది. ప్రైవేట్ రంగంలో వీటిని తయారు చేయనున్న తొలి సంస్థ ఇదే.

**గతిశక్తి పరిశోధన కేంద్రం**

- దేశంలో తొలి గతిశక్తి పరిశోధన కేంద్రాన్ని మేఘాలయాలోని షిల్లాంగ్‌లో ప్రారంభించారు. నౌకాయానం-జలమార్గాలు-పోర్ట్‌ల మంత్రిత్వ శాఖ, ఐఐఎం సంయుక్తంగా దీన్ని ఏర్పాటు చేశాయి.

## తెలంగాణ

**గ్యాస్ పథకం**

- రూ.500 గ్యాస్ సిలిండర్లు అందించే పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గడిచిన మూడు సంవత్సరాల్లో వాడిన గ్యాస్ సిలిండర్ల సగటును పరిగణనలోకి తీసుకొని ఆ మేరకు రాయితీ సిలిండర్లు ఇస్తారు. ఇందుకు విధించిన షరతులు.. తెల్ల రేషన్ కార్డ్ ఉండాలి. వారి పేరుతో వినియోగంలో



గ్యాస్ కనెక్షన్‌తో పాటు 2023 డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో రాయితీ సిలిండర్ కోసం దరఖాస్తు చేసుకొని ఉండాలి.
- ఈ పథక లబ్ధిదారులు 39,50,884గా గుర్తించారు. అధికంగా హైదరాబాద్‌లో, అత్యల్పంగా ములుగు జిల్లాలో ఉన్నారు.

**గృహజ్యోతి పథకం**

- 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను అందించే పథకం ఇది. రేషన్ కార్డ్‌ను ప్రామాణికంగా స్వీకరిస్తారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకొని ఉండాలి. అర్హులై ఉన్నవారు తాజాగా ఇచ్చినా స్వీకరిస్తారు.

**సేంద్రియ తేనె**




- వైల్డ్ ఫ్లేవర్స్ బ్రాండ్ పేరుతో సేంద్రియ తేనెను మార్కెట్‌లోకి తెలంగాణ ప్రభుత్వం తీసుకురానుంది. సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాల పరిశోధకులు దీన్ని అభివృద్ధి చేశారు.

**317 జీవోపై మంత్రివర్గ ఉపసంఘం**

- జిల్లాలు, జోన్లు, మల్టీజోన్ల పునర్వ్యవస్థీకరణతో తలెత్తిన వివిధ సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వైద్య-ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దీనికి నేతృత్వం వహిస్తారు.

**అమృత్ భారత్ స్టేషన్లు**

- దేశ వ్యాప్తంగా 500కు పైగా అమృత్ భారత్ స్టేషన్లను కేంద్రం ప్రారంభించింది. ఇందులో తెలంగాణలో 15 రానున్నాయి.



## వార్తల్లో వ్యక్తులు

**గీతా బాత్రా**



- ప్రపంచ బ్యాంక్‌కు చెందిన గ్లోబల్ ఎన్విరాన్‌మెంట్ ఫెసిలిటీకి చెందిన స్వతంత్ర మూల్యాంకన కార్యాలయం డైరెక్టర్‌గా భారత్‌కు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త గీతా బాత్రా నియమితులయ్యారు. అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి ఈ బాధ్యతను స్వీకరించిన ప్రపంచ తొలి మహిళ ఆమే.

**సచిన్ జైన్**

- వరల్డ్ గోల్డ్ కౌన్సిల్‌కు దేశంలో సీఈవోగా సచిన్ జైన్ నియమితులయ్యారు.

**సోమనాథన్**

- దేశ వ్యాప్తంగా అన్ని వ్యవస్థల్లో కేవైసీ ప్రమాణాలు ఒకేలా తీసుకు రావడానికి అవసరమైన సలహాలు, సూచనలు చేయడం కోసం ఆర్థిక కార్యదర్శి సోమనాథన్ నేతృత్వంలో ఒక కమిటీని నియమించారు. కేవైసీ అంటే నో యువర్ కస్టమర్ అంటే మీ వినియోగదారుడి సమాచారం తెలుసుకోండి అని అర్థం.

**ఖాన్విల్కర్**



- లోక్‌పాల్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఖాన్విల్కర్ నియమితులయ్యారు. ఈ వ్యవస్థకు తొలి చైర్మన్‌గా పినాకి చంద్ర ఘోష్ వ్యవహరించారు. ఆయన తర్వాత ప్రదీప్ కుమార్ మహంతి యాక్టింగ్ చైర్‌పర్సన్‌గా నియమితులయ్యారు.

**శశి థరూర్**

- ఫ్రాన్స్ అత్యున్నత పౌరపురస్కారాన్ని లోక్‌సభ ఎంపీ, కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్‌కు ప్రకటించారు. దౌత్యవేత్తగా శశిథరూర్‌కు పేరు ఉంది. 2006లో ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ పదవికి ఆయన పోటీ చేశారు. బాన్ కీ మూన్ విజయం సాధించారు. ఆ తర్వాత మన్మోహన్ సింగ్ మంత్రి వర్గంలో పనిచేశారు.

**లోకేష్ ముని**

- గ్లోబల్ జైన్ పీస్ అంబాసిడర్ అవార్డును లోకేష్ మునికి అందజేశారు.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

